వాణిజ్య కేంద్రం.. నేరాలమయం

- భారీగా అదృశ్యం కేసులు నమోదు
- ఆత్మహత్యలు కూడా ఎక్కువే
- ప్రొద్దుటూరు సబ్ డివిజన్ పరిధిలో ఈ ఏడాది నేరాలివీ..


ముస్తఖీమ్ (ఫైల్)

ప్రొద్దుటూరు వాణిజ్య కేంద్రంగా ప్రసిద్ధి. ఇతర జిల్లాల నుంచి బంగారు, దుస్తులు, ఇతర సామగ్రి కొనుగోలు చేసేందుకు ఇక్కడికి వస్తుంటారు. ప్రొద్దుటూరులోని వ్యాపార దుకాణాలు 365 రోజులపాటు కిటకిట లాడుతుంటాయి. అలాంటి వాణిజ్య కేంద్రంలో నేరాలు, ఘోరాలు, ఇలా అనేక కేసులు భారీగా పెరిగిపోయాయి. గతేడాదితో పోలిస్తే అనేక కేసుల్లో పెరుగుదల కనిపించడం ఆందోళన కలిగించే విషయం.


గాయపడిన రామలక్షుమ్మ

ప్రొద్దుటూరు క్రైం : పట్టణంలో ఇటీవల గ్యాంగ్‌ల సంస్కృతి పెరిగింది. ఏ కారణం లేకుండానే చిన్నపాటి కారణాలకు హత్యలు చేసిన ఘటనలు చోటు చేసుకున్నాయి. ఇటీవల జరిగిన పప్పీ హత్యతో ప్రొద్దుటూరులోని ప్రజలు ఉలికిపాటుకు గురయ్యారు. గతేడాదితో పోలిస్తే ఈసారి అనేక హత్యలు, ఆత్మహత్యలు, అదృశ్యం, హత్యాయత్నం కేసులు భారీగా పెరిగాయి. 2023లో వివిధ కారణాలతో ఏడుగురు హత్యకు గురి కాగా ఈ సారి పది మంది హత్యకు గురయ్యారు. గత ఏడాది 31 మోసం కేసులు నమోదు కాగా ఈ ఏడాది 33కు, హత్యాయత్నం కేసులు 16 నమోదు అయ్యాయి. స్వల్పగాయాల గొడవలు ఈ సారి భారీగా చోటు చేసుకున్నాయి.


వెంకటమహేశ్వరరెడ్డి హత్య కేసులో నిందితుడి అరెస్ట్ చూపిస్తున్న డీఎస్పీ మురళీధర్ (ఫైల్)

ఈ ఏడాదిలో జరిగిన ముఖ్యమైన నేరాలు

- ప్రొద్దుటూరులో తండ్రి అన్నం పెట్టకుండా చిత్రహింసలకు గురి చేసి కొట్టడంతో నాలుగేళ్ల ముస్తఖీమ్ అనే బాలుడు చనిపోయాడు.
- పట్టణంలోని వైఎంఆర్ కాలనీలో ద్వార్శల వెంకట మహేశ్వరరెడ్డిని దారుణంగా హత్య చేశారు. అతడి మృతదేహాన్ని మూడు ముక్కలు చేసి పట్టణ శివారు ప్రాంతంలో పడేశారు.
- ప్రొద్దుటూరుకు చెందిన ముదాఫీర్, పఠాన్ రహ్మతుల్లా, షాహిద్ అనే ముగ్గురు యువకులు దువ్వూరు మండలంలోని చల్లబసాయపల్లె వద్ద ఉన్న తెలుగుగంగ కాలువలో ఈత కొడుతూ ప్రమాదవశాత్తు మృతి చెందారు.
- తనకు ఇష్టంలేని పెళ్లి చేసిందనే కోపంతో ప్రొద్దుటూరులోని నేతాజీ నగర్–3లో నివాసముంటున్న బాల నాగమ్మను పెట్రోల్ పోసి నిప్పంటించడంతో సంఘటనా స్థలంలోనే చనిపోయింది.
- అనంతపురం జిల్లా యాడికి గ్రామానికి కొత్తూరు కంబగిరి రాముడు పేకాడేందుకు వచ్చి ప్రొద్దుటూరు మండలం కల్లూరు శివారులోని పెన్నానది ఒడ్డున అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు.
- తాళ్లమాపురం గ్రామంలో ఆరుబయట నిద్రపోతున్న రామలక్ష్మమ్మ అనే ఒంటరి మహిళపై గుర్తుతెలియని వ్యక్తి కత్తితో దాడి చేసి గాయపరిచాడు.
- సుందరాచార్యుల వీధిలోని ఒక లాడ్జీలో రాఘవేంద్ర కుమార్ అలియాస్ పప్పీని ముగ్గురు వ్యక్తులు మద్యం సీసాలతో కొట్టి గొంతు నులిమి చంపేశారు.
- శ్రీనివాసనగర్‌కు చెందిన జిలానీబాషా పట్టణంలోని శేషుగారివీధిలో ఉన్న పార్వతి ఆర్కేడ్ కాంప్లెక్స్‌లోని గదిలో బంగారు పని చేస్తుంటాడు. అతడి షాపులో ఆగస్టు 25న రాత్రి చోరీ జరిగింది. సుమారు 31 తులాలు బంగారు, రూ.50 వేలు నగదును దుండగులు దోచుకొని వెళ్లారు. ఈ ఘటనపై టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే నాలుగు నెలలు గడిచినా చోరీ కేసులో ఎలాంటి పురోగతి కనిపించలేదు.

2024లో జరిగిన వివిధ నేరాల వివరాలివీ..

నేరం	కేసుల సంఖ్య
ఆత్మహత్యలు	76
హత్యలు	10
హత్యాయత్నాలు	16
మోసం కేసులు	33
గొడవల్లో తీవ్రమైన గాయాలు	02
స్వల్పంగా గాయపడిన కేసులు	112
దోపిడీలు	01
అత్యాచారాలు	07
కిడ్నాప్‌లు	01
రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందిన వారు	12

క్లుప్తంగా

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

మైదుకూరు : మైదుకూరు మున్సిపాలిటీ కౌన్సిల్ అత్యవసర సమావేశాన్ని సోమవారం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ జి.శ్రీనివాసరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక తెలుగు గంగ కాలనీలోని మున్సిపల్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు చైర్మన్ మాచనూరు చంద్ర అధ్యక్షతన సమావేశం జరుగుతుందన్నారు. పురపాలక సభ్యులు సమావేశానికి హాజరు కావాలని కోరారు.

ఫసల్ బీమాకు రేపే గడువు

మైదుకూరు : ఫసల్ బీమాకు ప్రీమియం చెల్లించేందుకు మంగళవారం వరకు గడువు ఉందని మండల వ్యవసాయాధికారి పి.లక్ష్మీప్రసన్న ఒక ప్రకటనలో తెలిపారు. రబీ సీజన్‌లో వేసిన వేరుశనగ, శనగ, నువ్వులు, మినుములు, పెసర, పొద్దుతిరుగుడు, వరి పంటలకు ఫసల్ బీమా కింద రైతులు ఇన్సూరెన్స్ చేసుకోవాలని ఏఓ కోరారు. ఇంకా ఎవరైనా మిగిలిపోయి ఉన్న రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

చెస్ టోర్నమెంట్ పోటీలు


విజేతలకు బహుమతులు అందిస్తున్న కౌన్సిలర్ శివజ్యోతి

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక కొర్రపాడు రోడ్డులోని శివశంకర్ షాపింగ్ కాంప్లెక్స్‌లో అండర్–15 చెస్ పోటీలు ఆదివారం నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలకు కౌన్సిలర్ గాజుల శివజ్యోతి బహుమతులు అందజేశారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఇమాం హుస్సేన్, చింతకుంట కుతుబుద్దీన్, రెడ్డి పవన్, ముజమిల్ పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం


క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న సీఐ, ఎస్ఐ, పరిశ్రమ ప్రతినిధులు

బద్వేలు అర్బన్ : విధినిర్వహణలో భాగంగా నిత్యం పనిఒత్తిడితో ఉండే సిబ్బందికి క్రీడలు మానసిక ఉల్లాసాన్ని అందిస్తాయని అర్బన్ సీఐ ఎం.రాజగోపాల్, రూరల్ ఎస్ఐ కె.శ్రీకాంత్‌లు తెలిపారు. సెంచరీ పానెల్స్ పరిశ్రమ ఏర్పాటు చేసి ఏడాదైన సందర్భంగా ఆదివారం పట్టణంలోని ఎస్‌బీవీఆర్ కళాశాల క్రీడా మైదానంలో సిబ్బందికి క్రికెట్ పోటీలు ఏర్పాటు చేశారు. అలాగే సీఐ, ఎస్ఐలు కొద్దిసేపు క్రికెట్ ఆడి క్రీడాకారుల్లో ఉత్సాహం నింపారు. కార్యక్రమంలో సెంచరీ పానెల్స్ జనరల్ మేనేజర్ రమేష్‌రెడ్డి, ప్లాంట్ హెడ్ రామగణపతి, లాజిస్టిక్ హెడ్ మనోజ్, హెచ్‌పీఎల్ దత్త, డీజీఎం ఉత్తమ్‌రెడ్డి, సిబ్బంది, క్రీడాకారులు పాల్గొన్నారు.

యువతను సన్మార్గంలో నడిపించేందుకు కృషి చేయాలి


డీవైఎఫ్ఐ క్యాలెండర్‌ను విడుదల చేస్తున్న అర్బన్ సీఐ రాజగోపాల్

బద్వేలు అర్బన్ : యువతను సన్మార్గంలో నడిపించేందుకు డీవైఎఫ్ఐ నాయకులు కృషి చేయాలని అర్బన్ సీఐ ఎం.రాజగోపాల్ తెలిపారు. డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో రూపొందించిన క్యాలెండర్లను ఆదివారం స్థానిక అర్బన్‌స్టేషన్ ఆవరణలో ఆయన విడుదల చేసి మాట్లాడారు. నిరుద్యోగుల సమస్యల పరిష్కారానికి, వివిధ అంశాలలో వారిలో చైతన్యం నింపేందుకు డీవైఎఫ్ఐ చేస్తున్న కృషి గొప్పదన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎం.చిన్ని, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు మస్తాన్ షరీఫ్, ఆదిల్ తదితరులు పాల్గొన్నారు.

హైందవ శంఖారావం సభను జయప్రదం చేయండి


చాపాడులో ఏకల్ పాఠశాల మాస వర్గ కార్యక్రమంలో పాల్గొన్న సభ్యులు

చాపాడు : విజయవాడలో జనవరి 5న జరిగే హైందవ శంఖారావం సభను జయప్రదం చేయాలని కడప జిల్లా అంచల్ అధ్యక్షుడు చెన్న కృష్ణయ్య పేర్కొన్నారు. మండల కేంద్రమైన చాపాడులోని ఆత్మరామ స్వామి దేవాలయం వద్ద ఆదివారం ప్రొద్దుటూరు ఏకల్ పాఠశాల మాస వర్గ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన చెన్న కృష్ణయ్య మాట్లాడుతూ హిందూ ధర్మం యొక్క గొప్పతనాన్ని ప్రజలకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సమరసత సేవా ఫౌండేషన్ మండల కన్వీనర్ సుబ్బరాయుడు, కార్యాలయ ప్రముఖ్‌లు రామకృష్ణ, రామచంద్రుడు, సృజన, ఓబులేసు, ఆచార్య మాతాజీలు తదితరులు పాల్గొన్నారు.

రైతు కుటుంబాన్ని పరామర్శించేందుకు తీరిక లేదా?

పవన్‌కల్యాణ్‌ను ప్రశ్నించిన రెడ్యం



చాపాడు : అప్పుల బాధ తాళలేక ఆత్మహత్యకు పాల్పడిన రైతు నాగేంద్ర బంధువులను ఓదార్చేందుకు డిప్యూటీ సీఎం పవన్‌కు తీరిక లేకపోగా హేళనగా మాట్లాడడం పట్ల వైఎస్సార్‌సీపీ నేత, ఏపీఎస్ ఆర్టీసీ మాజీ జోనల్ చైర్మన్ రెడ్యం వెంకటసుబ్బారెడ్డి ధ్వజమెత్తారు. ఆదివారం రెడ్యం విలేకరులతో మాట్లాడుతూ గాలివీడు ఘటనలో దాడికి గురైన ఎంపీడీఓ జవహర్‌బాబును పరామర్శించిన పవన్‌కల్యాణ్, కాకినాడలో తన సొంతపార్టీ ఎమ్మెల్యే పంతం నానాజీ చేతిలో దాడికి గురైన దళిత డాక్టర్ ఉమామహేశ్వరరావు, తిరుపతి ఎస్వీ యూనివర్సిటీలో బీజేపీ నాయకుల దాడిలో బాధితుడైన ప్రొఫెసర్ చెంగయ్యను ఎందుకు పరామర్శించలేదో సమాధానం చెప్పాలని నిలదీశారు. సుదర్శన్‌రెడ్డి మంచి న్యాయవాదిగా గుర్తింపు తెచ్చుకున్నారని, గతంలో ఆయన ఎక్కడా గొడవ పడిన చరిత్ర లేదని, అలాంటి సుదర్శన్‌రెడ్డిని సీఐ కాలర్ పట్టుకుని ఈడ్చుకెళ్లిన ఘటన పోలీసు దౌర్జన్యానికి పరాకాష్ట అని మండిపడ్డారు.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి


ఆటల పోటీల్లో విద్యార్థుల తల్లులు

ప్రొద్దుటూరు కల్చరల్ : ప్రజలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున పేర్కొన్నారు. స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ మైదానంలో ఇంటర్‌నేషన్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ఆధ్వర్యంలో ఫిట్, ఫన్, ఫుడ్‌పై అవగాహన కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాంత్రిక జీవితంలో మానవుడు ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపడంలేదని ఫలితంగా షుగర్, బీపీ, ఊబకాయం వంటి జబ్బుల బారిన పడుతున్నారన్నారు. ఆరోగ్యం కోసం రోజూ అరగంట నడక అలవాటు చేసుకోవాలని సూచించారు. పాఠశాల చైర్మన్ డాక్టర్ వి.జయచంద్రారెడ్డి మాట్లాడుతూ ఫన్, ఫిట్, ఫుడ్ మన జీవితంలో ఒక భాగం కావాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు పోటీలు నిర్వహించి చైర్మన్ చేతుల మీదుగా బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ వి.లోహిత్‌రెడ్డి, డాక్టర్ కిశోర్, ప్రిన్సిపల్ రవిశంకర్ కార్యక్రమంలో పట్టణ ప్రజలు, వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న బీసీ ప్రజా చైతన్య సమాఖ్య నాయకులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక బీసీ ప్రజా చైతన్య సమాఖ్య కార్యాలయంలో ఆదివారం సమాఖ్య 2025 క్యాలెండర్‌ను నాయకులు ఆవిష్కరించారు. సమాఖ్య అధ్యక్షుడు బొర్రా రామాంజనేయులు నూతన సంవత్సరం అందరికి శుభాలు తేవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి దేవేంద్రుడు, కోశాధికారి సంటెయ్య, ఉపాధ్యక్షుడు విజయ ప్రతాప్ నాయుడు, భాస్కర్, భాస్కర్‌రావు, ఆదినారాయణ, పరమేశ్వరరావు, చౌడయ్య తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యాలయంలో..

తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన 2025 క్యాలెండర్‌ను స్థానిక టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి ఆవిష్కరించారు. నూతన సంవత్సరం అందరికి మంచి జరగాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఓబులేసు, రమణయ్య, చంద్రశేఖర్ రెడ్డి, బాబు, బోగాధి, సుధాకర్, వెంకటేశ్వర్లు, పుల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా.. శివపార్వతుల కల్యాణోత్సవం


కల్యాణోత్సవంలో గంగారాజరాజేశ్వరి సమేత అగస్త్యేశ్వరుడు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం అగస్త్యేశ్వరస్వామి, రాజరాజేశ్వరి మూల విరాట్‌లకు విశేష పూజలు జరిపారు. వేకువ జామున స్వామి వారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రాజరాజేశ్వరి అమ్మవారికి కుంకుమార్చన చేసి ప్రత్యేకంగా అలంకరించారు. గోపూజ, గణపతి, నవగ్రహ, రుద్రహోమాలను నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. సాయంత్రం గంగారాజరాజేశ్వరి సమేత అగస్త్యేశ్వరస్వామి ఉత్సవ మూర్తులను కళ్యాణ వేదికపై ఆశీనులను చేశారు. వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య వైభవోపేతంగా కల్యాణోత్సవం జరిపారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాద వినియోగం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, ఈఓ రామచంద్రాచార్యులు, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఎంపీజే రాయలసీమ ఇన్‌చార్జిగా అయూబ్‌ఖాన్


నియామక పత్రం అందుకుంటున్న అయూబ్‌ఖాన్

ప్రొద్దుటూరు కల్చరల్ : మూవ్‌మెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ రాయలసీమ ఇన్‌చార్జిగా ఎండీ అయూబ్‌ఖాన్ నియమితులయ్యారు. స్థానిక ఎంపీజే కార్యాలయంలో సుప్రీం కౌన్సిల్ మెంబర్ హుస్సేన్ అహ్మద్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సలీం చేతుల మీదుగా అయూబ్‌ఖాన్ నియామకపత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా అయూబ్‌ఖాన్ మాట్లాడుతూ వివిధ మతాల మధ్య సోదర భావాన్ని పెంపొందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో హుస్సేన్‌బాషా, నజీర్ అహ్మద్, రఫీ, అస్లాం, ఇస్మాయిల్, రవి, ముక్తియార్, సయ్యద్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల భవన నిర్మాణం పూర్తిచేయాలి

బ్రహ్మంగారిమఠం : గత ప్రభుత్వంలో నాడు- నేడు కింద చేపట్టిన పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల భవనాల నిర్మాణాలు కూటమి ప్రభుత్వం పూర్తి చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎద్దు రాహుల్ డిమాండ్ చేశారు. ఆదివారం బి.మఠం మండలంలో అసంపూర్తిగా నిలిచిన పాఠశాల భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాలను ఎస్ఎఫ్ఐ బృందం పరిశీలించారు. ఈ సందర్భంగా బి.మఠంలో రాహుల్ మాట్లాడుతూ కొన్ని గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణాలు అసంపూర్తిగా ఉండడంతో పిల్లలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం తక్షణం అసంపూర్తిగా నిలిచిపోయిన పాఠశాలల భవనాలను పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.

ఆ రోడ్డు వెంట ప్రయాణం నరకయాతనే


అధ్వానంగా ఉన్న రహదారి

బి.కోడూరు : మండల కేంద్రానికి కూతవేటు దూరంలోని నల్లవాగుపల్లె నుంచి బి.కోడూరుకు వెళ్లే బీటీ రోడ్డు వరకు రహదారి వెంట వెళ్లాలంటే నరకయాతనగా మారింది. రోడ్డు అంతా మోకాలి లోతు గుంతలతో ఇరువైపులా కంపచెట్లతో నిండిపోయి వాహనదారులకు తీవ్ర ఇబ్బందిగా మారింది. ఈ దారి వెంట అంకనగొడుగునూరు, అంగనగొడుగునూరు ఎస్సీ కాలనీ, నల్లవాగుపల్లె, సిద్దుగారిపల్లె, మేకవారిపల్లె గ్రామాలతో పాటు సుమారు పది గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి వివిధ కేంద్రానికి వివిధ పనుల నిమిత్తం వెళుతూ ఉంటారు. కానీ ఆ దారి అంతా గుంతలమయంగా, కంపచెట్లతో నిండి ఉండటంతో గత్యంతరం లేక మరాటిపల్లె మీదుగా తిరిగి వెళ్లాల్సి వస్తుందని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షం సమయంలో ఈ దారి గుంతలమయమై కంకర రాళ్ళు తేలి ఉండటంతో వాహనదారులు, పాదాచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రహదారి నిర్మాణం కోసం గత ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి దృష్టికి పలువురు తీసుకెళ్లగా అందుకు సంబంధించిన నివేదికలను సిద్ధం చేసి టెండర్లు పిలవడం జరిగింది. కానీ టెండర్లు దక్కించుకున్న గుత్తేదారులను ప్రస్తుత కూటమి ప్రభుత్వ నాయకులు పనులు చేయనివ్వకపోవడంతో ఆ రహదారి పనులు అలాగే నిలిచిపోయాయి. దీనిమూలంగా సుమారు 15 గ్రామాల ప్రజల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ప్రస్తుతం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు సంక్రాంతి పండుగలోపు గుంతలు లేని రహదారుల ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దాలన్న సంకల్పంతో ప్రతిరోజూ ప్రకటనల ద్వారా ప్రచార ఆర్భాటాలు చేస్తున్నారు తప్ప వాటి అమలుకు కింది స్థాయిలో నోచుకోవడం లేదని పలు విమర్శలు వస్తున్నాయి. ఇకనైనా సంబంధిత అధికారులు చొరవచూపి ఆ రహదారికి సంబంధించిన ఆధునీకరణ పనులు చేపట్టి పూర్తి చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ప్రమాదాలు జరిగే వరకు పట్టించుకోరా


మిద్దె పైన తలకు తగులుతుండటంతో వంగి వస్తున్న కాలనీవాసులు


మిద్దెపై తలకు తగిలేంత ఎత్తులో ఉన్న విద్యుత్ లైన్


ప్రభలవీడు వద్ద చేతికందే ఎత్తులో ఉన్న విద్యుత్ వైర్లు


ఇటీవల 11 కె.వి. విద్యుత్ వైర్లు తగిలి ప్రమాదానికి గురైన నాగేశ్వర్‌రెడ్డి

బి.కోడూరు : ప్రమాదాలు జరిగి ప్రాణాలు గాలిలో కలిసిపోయేంత వరకు పట్టించుకోరా అంటూ సిద్దుగారిపల్లె కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రానికి కూతవేటు దూరంలోని సిద్దుగారిపల్లె ఎస్సీకాలనీ నడిబొడ్డున 11 కె.వి. విద్యుత్ వైర్లు కాలనీ మీదుగా వెళుతూ ఆ కాలనీలోని నివాసాలకు తగులుతూ ఉంది. ఈ కాలనీ ఏర్పడి సుమారు 20 సంవత్సరాలు అవుతుంది. అప్పటి నుంచి విద్యుత్ లైన్‌ను మార్చి ప్రమాదాల నుంచి కాపాడాలని ఆ కాలనీ వాసులు విద్యుత్ అధికారుల చుట్టూ, ప్రజాప్రతినిధుల చుట్టూ కాళ్ళరిగేలా తిరిగినా పట్టించుకునే నాథుడే కరువయ్యారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా ప్రస్తుతం ఆర్‌డీఎస్ పథకం కింద గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ లైన్లు పునరుద్ధరిస్తున్నప్పటికీ ఆ క్రమంలోనైనా ఆ విద్యుత్ లైన్‌ను మార్చాలని కోరినప్పటికీ దళితులనే నెపంతో చిన్నచూపు చూస్తున్నారే తప్ప సమస్యను పరిష్కరించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా కాలనీ మీద కాకుండా విద్యుత్ లైన్ మార్చాలంటే ఒక విద్యుత్ స్తంభం, 60 మీటర్ల విద్యుత్ వైరుతో మార్చవచ్చని గతంలో సబ్ ఇంజనీర్లు సలహాలు ఇచ్చినప్పటికీ స్థానికంగా ఉన్న నాయకులు చొరవ చూపకపోవడంతో ఈ సమస్య నేటికీ పరిష్కారం కాలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలనీ మీదుగా వెళుతున్న వైర్లు 11 కె.వి. విద్యుత్ వైర్లు కావడంతో వర్షాలు వచ్చిన సమయంలో కాలనీలోని ఇళ్ళకు విద్యుత్ సరఫరా కావడంతో వారు ఆందోళన చెందుతున్నారు. ఏమరపాటున పిల్లలు మిద్దెపైకి వెళ్ళి ఆడుకోవడం గాని చేస్తే పెద్ద ప్రమాదం జరిగే అవకాశం ఉందని వారు ఆందోళన చెందుతున్నారు. నెల రోజుల క్రితం పాత ప్రభలవీడు గ్రామానికి చెందిన కె.నాగేశ్వర్‌రెడ్డి అనే వ్యక్తికి చేతికందే ఎత్తులో 11 కె.వి. విద్యుత్ వైర్లు ఉండటంతో ఆదమరిచి ట్రాక్టర్‌తో పొలం పనులు చేస్తుండగా హైటెన్షన్ వైర్లు తలకు తగిలి పెద్ద ప్రమాదానికి గురయ్యాడని, హుటాహుటిన కడపలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్ళి రూ.4 లక్షలు ఖర్చు చేస్తే ప్రాణాపాయం నుంచి కాపాడారే తప్ప ఇప్పటికీ కోలుకోలేదన్నారు. ఇంత ప్రమాదాలు జరిగి ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొనే వరకు విద్యుత్ అధికారులు సమస్యను పరిష్కరించే దిశగా చొరవ చూపలేరా అని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు చొరవచూపి ఏదైనా ప్రమాదాలు జరిగి ప్రాణాపాయం జరగక ముందే విద్యుత్ లైన్‌ను కాలనీ మీద నుంచి మార్పు చేసి కాపాడాలని కాలనీవాసులు కోరుతున్నారు.

ఫ్రెండ్స్ అసోసియేషన్ క్యాలెండర్ ఆవిష్కరణ

బద్వేలు అర్బన్ : బద్వేలు ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన 2025 క్యాలెండర్‌ను ఆదివారం పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ రాబోవు రోజుల్లో ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ న్యాయ సలహాదారుడు డి.వి.ఎస్.ఆర్.కృష్ణ, ప్రధాన కార్యదర్శి వెంకటరమణ, ఉపాధ్యక్షుడు పత్తిశ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ



పోరుమామిళ్ల : పోరుమామిళ్ల మాజీ మండలాధ్యక్షుడు, మాజీ జడ్పీటీసీ, పంచాయతీరాజ్ రూరల్ డెవలప్‌మెంట్ మాజీ రాష్ట్ర సలహాదారు నాగార్జున రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని ఆదివారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. నాగార్జునరెడ్డి అమెరికాలో ఉండటంతో ఇక్కడ కృష్ణశారద కళాశాల సిబ్బంది జన్మదిన వేడుకలు నిర్వహించారు.

బ్రాహ్మణ సంఘాల ఐక్యతకు కృషి

బద్వేలు అర్బన్ : రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బ్రాహ్మణ సంఘాలన్నింటిని ఐక్యం చేసేందుకు కృషి చేస్తున్నట్లు బ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వాసుదేవరావు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక గౌరీశంకర్‌నగరలోని శ్రీరమాసహిత సత్యనారాయణస్వామి ఆలయ ఆవరణలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విభాగాలుగా విడిపోయిన బ్రాహ్మణ జాతిని ఏకం చేయాలన్న ఏకైక లక్ష్యంతో రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించి సమావేశాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. నేటి సమాజంలో బ్రాహ్మణుల పరిస్థితి దయనీయంగా ఉందని, సంఘటితంగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. సమావేశంలో బ్రాహ్మణ సంఘం సీనియర్ నాయకులు సింగంపల్లిశివయ్య, బోయనకుంట్లసుబ్బనరసయ్య, బ్రాహ్మణ సంఘం కార్యదర్శి సత్యనారాయణశర్మ, నాయకులు ఐ.ఎం.రావు, సుబ్రమణ్యం, పద్మనాభరావు తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయండి


కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

బద్వేలు అర్బన్ : జనవరి 4, 5వ తేదీల్లో కడప నగరంలో జరగనున్న సీపీఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు అన్వేష్, రూరల్ కార్యదర్శి డి.వెంకటేష్‌లు పిలుపునిచ్చారు. బద్వేలులోని సి.కొత్తపల్లె కాలనీలో ఆదివారం జిల్లా మహాసభలకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరుబాట కొనసాగించడంతో పాటు విభజన చట్టంలో పొందుపరిచిన హామీ మేరకు జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు పోరాటాలు కొనసాగిస్తామన్నారు. పేద, మధ్యతరగతి సామాన్య ప్రజల కోసం అనునిత్యం ఉద్యమించే సీపీఎం పార్టీ మహాసభలను వేదికగా చేసుకుని భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తుందని తెలిపారు.